ప్రాయోజకులు

రేకా అంబయ్య
రేకా సునందనమ్మ
చారిటబుల్ ట్రస్టు
సిద్ధిపేట - 502 103.

"ఏమోయ్ శైలూ ! ఇలారా !"

వేళకానివేళ భూపాలం పాడినట్టు ... ఇప్పుడు ఇదేం పిలుపూ ? రవిచంద్ర పిలుపు శైలజకే మాత్రం నచ్చలేదు సరికదా ఒంటిమీద తేళ్లూ జెర్రులు పాకినట్టైంది. కాని ... ఎంతైనా జీవితాన్ని పంచియిచ్చిన భర్తగదా ! చేతులు కొంగుకు తుడుచుకుంటూ బయటికొస్తూంటే నెలవంకల్లా గున్న కనుబొమ్మల మీద ముంగురులాడుకుంటున్నాయి.

"ఇదేమిటో చూడవోయ్ !" అంటూ భర్త అందించిన పాకెట్టు లటుక్కున అందుకుని చటుక్కున వెనుదిరిగింది.

"ఆగాగు. విప్పిచూడాలోయ్ !" భుజంతట్టి తనవైపుకు తిప్పుకున్నాడు రవిచంద్ర.

"మీరే విప్పుకోండి " తిరిగివ్వబోయింది.

"ప్లీజ్ ... ప్లీజ్ ... విప్పిచూడు శైలూ !" తల్లిముందు చిన్నపిల్లాడిలా బతిమాలాడు.

గబగబా విప్పేసింది. ...చీర ...గులాబి రంగుపట్టుచీర. కాఫీకలర్ పూవుల అంచు... అదరగొట్టేస్తుంది. గులాబి రంగంటే అతనికెంతో ఇష్టమని చెప్పాడోసారి. చీర విప్పి భుజంమ్మీద వేసుకోవాలన్పించింది. కాని ... కానీ ... నిశ్చల సముద్రములో తుఫానులా, మనసంతా గందరగోళం

"ఇప్పుడెందుకటా ?" అడిగింది గంభీరంగా. ముక్కుపుడక తళుక్కుమంది.

కొత్తచీర కనబడగానే పెళ్లాం మొహం పారజాత పుష్పంలా విచ్చుకుంటుందనుకున్న రవిచంద్ర నీరుగారి పోయాడు.

కొత్తచీరా, పూలూ, గాజులూ ... ఇవేగదా ఆడదాన్ని ఆకట్టుకునే సాధనాలు. కాని ... ఈవిడో జడపదార్థం లాగుందే. ఏమైనా సరే ... పెళ్లాన్ని ప్రసన్నం చేసుకోవాల్సిందే.

"ఎందుకేమిటోయ్ ! ఈరోజు నీ శ్రీవారి పుట్టినరోజు. నేనీ రోజే పుట్టానండీ శ్రీమతిగారూ !" జోకు తేలికైపోయింది.

ఓయ్, గీయ్ ... ఈ బుద్ధావతారానికిదొక్కటే తక్కువైందా ? నిన్నగాక మొన్న మూడు ముళ్లేసినంత మాత్రాన అంతచనువా ?

"మీ పుట్టిన రోజా ? ఐతే ఏఁవిటటా ?" భృకుటి ముడేసుకుంది. నల్లని కనుబొమ్మల మధ్య ఎఱ్ఱని కుంకుమ బొట్టు మెరిసింది.

"ఏవిటేఁవిటీ ? సాయంత్రం నేనాఫీసునుండి వచ్చేసరికి నువ్వీ చీరలో రెడీగుండాలి "

బయలుదేరాడండీ మొనగాడు ... గొణుక్కుని "ఎందుకటా ?" పైకి అడిగింది.

"గుడికెళ్లి పూజ చేయిద్దాం. అట్నుంచటే సిన్మాకెల్దాం. సరదాగా హోటల్లో భోం చేసొద్దాం." గారాభంగా ముందుకు జరిగాడు. ఆమె వెనక్కు జరిగింది.

అతని కిష్టమైన చీర, అతని పుట్టిన రోజునాడు నేను కట్టుకోవాలా ? నేనేమీ కట్టుబానిసను కానే. నామీద అతనికెందు కంత అధికారం ? ఒళ్లు మండింది. మూతి మూడు వంకర్లు తిరిగింది. చీరెను దండెం పైకి విసిరేసింది.

"వంటింట్లో ఎలుకలండీ !" అంటూ తప్పుకుంది.

రవిచంద్ర గుండెకు గుండుసూది గుచ్చుకున్నట్టైంది.

అరె ! ఎప్పుడన్నా ఖుషీగా మాట్లాడిందా ? అలిసిపోయి ఆఫీసునుండి రాగానే ఎన్నడన్నా ఎదురొచ్చి వేడి కాఫీ అందించిందా ? "రవిచంద్రా! అందమంతా ఆడవాళ్లదేనని విర్రవీగుతున్న మేము నిన్ను చూచి అభిప్రాయం మార్చుకుంటున్నా" మనేవారు గర్ల్ క్లాసుమేట్సు. మరీవిడెందుకిలా ప్రవర్తిస్తుందీ? కొత్త దంపతుల అనురాగమిలాగే ఉంటుందా ? ... మనసులో ఆవేదన. ఆరాటం.

"సరే ... సాయంత్రం రెడీగుండాలి సుమా !" స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు.

శైలజ అటే చూస్తూ కుర్చీలో కూలబడింది.

రవిచంద్ర మాటలు వింటూంటే జున్నుపాలలో పంచదార కలుపుకు తిన్నట్టుంటుంది. ఆ మాయదారి మాటలే అమ్మా నాన్నల్ని బుట్టలో వేసుకున్నాయి. తను పంజరంలో చిలకైంది.

అదే అతని స్థానంలో మోహన్ ఉంటేనా ... జీవన బృందావనములో వేయి పున్నమలు పూచేవి. అనురాగ సీమలో అభినవ మన్మధుడై అలరించేవాడు. మోహన్ ... ! ఓహ్ ! ఎంత తియ్యగుందా పేరు ! కండలు తిరిగిన శరీర సౌష్టవం, పొట్టేలు కొమ్ముల్లా వంకీలు తిరిగిన జుట్టు, చలాకీ చూపులు ... ఆ చూపులే తనకు గాలంవేశాయి. కళాశాల వార్షికోత్సవ ప్రదర్శనల్లో అతడు ప్రవరాఖ్యుడు, తాను వరూధిని. ఎంత బాగా సాగిందా ప్రదర్శన ! 'మీరిద్దరూ పాత్రల్లో జీవించా'రన్నారంతా.

అపురూపమైన అంద చందాలతో, హొయలొలికిస్తూ ప్రవరాఖ్యుణ్ణి తనపాదదాసునిగా చేసుకోవాలని వరూధిని ప్రయత్నం. అతనిలో కరిగి పోవాలనే ఆరాటం. ఆ పాత్ర తనకెంతో తృప్తినిచ్చింది.రిహార్సల్స్ వేసేప్పుడు ఎంత బాగా మాట్లాడేవాడు !. ఎప్పుడూ మచ్చలేని పున్నమి చంద్రుడిలా- తెల్లని డ్రెస్సులో కనబడేవాడు. చూపులతో పగలే వెన్నెల కురిపించేవాడు. అతన్తోనే గడపాలన్పించేది. అతని ప్రేమ సామ్రాజ్యానికి పట్టపురాణై పోవాలని మనసు ఉవ్విళ్లూరేది.

నాటక ప్రదర్శన తర్వాత అతని గదికెళ్లింది. అరమరికలు లేకుండా చాలాసేపు మాట్లాడాడు. చివరికి తానే సిగ్గువిడిచి "నాగురించి నీ అభిప్రాయమేమి" టని అడిగేసింది. అప్పటికే బుగ్గల మీద సిగ్గులు పూచినై.

"నీగురించి చెప్పాలంటే నేనో కవినై పోవాలి శైలజా !"

"హం ...టే ..!" నవ్వొచ్చింది.

"నీ నవ్వు నయాగారా జలపాతం. నడక నెమళ్లకు నాట్యం నేర్పుతుంది. మాటలు తేనె జల్లులు. ... అంతా కలిపితే ప్రాణమొచ్చిన అజంతా శిల్పసుందరివి. నిన్ను పెళ్లాడే వాడెవడో గాని చాలా అదృష్టవంతుడు సుమా !"

తన ఎదపొదలో వెయ్యి గులాబిలొకేసారి విచ్చుకున్నాయి. ఎదపూచిన గిలిగింతలు పెదాలపైకి పాకాయి. మనసులోని మాట బయటికి చెప్పలేకపోయాడేమో ! తానూ సూటిగా చెప్పలేక పోయింది. ఆతర్వాత పరీక్షలు, సెలవులు.

సెలవులకు ఊరెళ్లేముందు అతణ్ని తీసుకెళ్లి అమ్మానాన్నలకు పరిచయం చెయ్యాలన్పించింది. కాని ... అతడంతకు ముందు రోజే గది ఖాళీ చేసి వాళ్లూరెళ్లాడని తెలిసింది. అతనింటి అడ్రసుకో ఉత్తరం రాసిపడేసి బస్సెక్కింది.

ఊరెళ్లిన మర్నాడే బంధువుల పెళ్లికి నల్లగొండ వెళ్లాల్సి వచ్చింది. వెళ్లాక అక్కడే తనకు పెళ్లిచూపులన్నారు. గుండె గుబగుబ లాడింది. రక్తంపిండి నట్టనిపించింది.

నోనో .. వీల్లేదు. మనస్సనే సరోవరములో తిరగాడుతున్న హంస - మోహన్ గురించి అమ్మా నాన్నలకు చెప్పెయ్యాలనుకుంది కాని అది బంధువుల ఇల్లు. ఎటుబొయ్యి ఎటొస్తుందో !

"నాకిప్పుడే పెళ్లొద్దు నాన్నా !" అనేసింది.

"పిచ్చి శైలా ! అబ్బాయి మీ నాన్నగారి చెల్లెలు కొడుకే !" వీపు నిమిరి నవ్వేసింది అమ్మ.

"నాన్నకో చెల్లెలుందని ఎప్పుడూ చెప్పలేదే !"

"అదేనమ్మా ! మా బాబాయి కూతురు. చిన్నప్పుడు కలిసి ఆడుకున్నాం." నాన్న అందుకున్నాడు.

"వాళ్లిక్కడే ఉన్నారిప్పుడు. అబ్బాయి అందగాడు. బాగా చదివాడు. మంచి ఉద్యోగముంది. ఊళ్లో ఆస్తుపాస్తులున్నై ... "

"ఐనా సరే ! నాకిప్పుడు పెళ్లొద్దు "తెగేసి చెప్పేసింది. నాన్న మొహంలో రంగులు మారాయి.

"నీకెప్పుడు ఎవరితో పెళ్లి చెయ్యాలో నాకు బాగా తెల్సు. నోర్మూసుకుని తయారవు." అని "ఏమేవ్ ! ఓగంటలో వాళ్లొస్తారు. అమ్మాయిని తయారు చేయించు" మని అమ్మనాదేశించాడు.

నాన్న చండశాసనుడు. తాననుకున్నది జరక్కపోతే ఇల్లుపీకి పందిరేస్తాడు.

పెళ్లి చూపులైపోయినై. అమ్మాయి నచ్చిందని అక్కడే చెప్పేశారు.

పెళ్లంటే చాక్లెట్ చప్పరించడం కాదు. అది నూరేళ్ల పంట. జీవిత భాగస్వామి నెన్నుకునేప్పుడు ధైర్యంగా వ్యవహరించాలి. ఇంటి కెళ్లగానే అసలు సంగతి అమ్మద్వారా నాన్నకు చెప్పించి మోహన్ ఇంటికి పంపించాలనుకుంది. కాని ... ఇంటికెళ్లే సరికి మోహన్ పెళ్లిపత్రిక వచ్చిపడుంది. అంతకు ముందు రోజే పెళ్లై పోయిందని అర్థమై పోయింది.

అయ్యో ! నాగుండెల్లో మోహన రాగమాలపించిన మోహన్ మరో ఆడదాని కొంగు బంగారమయాడా ! ఆశలపందిరి కూలి పోయింది. గుండెనరాలు పెటేల్మని పేలిపోయినై. నాన్నకింకేం చెప్పాలి ? దుఃఖం ముంచుకొచ్చింది. తలవంచుకుని రవిచంద్రతో మూడుముళ్లేయించుకోక తప్పలేదు.

కాని ... మోహన్ ! నీ మోహన రూపం నా మనోఫలకమ్మీంచి చెదిరి పోతుందా ? మనసులు కలసిన మనం మరొకరి సొంతమై సుఖంగా ఉండగలమా ? ....

వంటింట్లో ఎలుకల గోల ఎక్కువైంది. గబుక్కున లేచి తలుపేసి వెళ్లి సామానులు సర్దుతూంది.

"టక్ టక్ ... టక్ టక్ " ఎవరో తలుపు తడుతున్నారు. తలపుల్లోంచి బయటపడి తలుపులు తీసింది.

అరె ! కలా ! నిజమా ! మోహన్ ... నా మోహన్ ! కళ్లు అరచేతులంతైనై. మొహం నిండుగా విచ్చుకుంది. వెంటనే బాధ ... పొత్తి కడుపులోంచి తన్నుకొచ్చిన బాధ గుండె గోడల్ని తాకుతూ కళ్లల్లో కరిగింది.

మోహన్ పక్కన మరో యువతి.

కథా నిలయం
881
శ్రీకాకుళం

వాళ్ళిద్దర్నీ దింపిన ఆటో తిరిగి వెళ్తూంది. అగాధం ఒడ్డున నిల్చుండి కిందకు చూస్తున్నట్టనిపించింది.

ఎప్పుడూ తెల్లని డ్రెస్సులో మల్లెపూవులా గుండే మోహన్ రంగుల పాంటూ, అడ్డగీతల షర్టూ ఇన్‌షర్ట్‌లో సీతాకోక చిలుకలా గున్నాడు. హాయిగా నవ్వుతున్నాడు. లోపలికి రాగానే ఆవిడ తన భార్య సుశీల అని పరిచయం చేశాడు. ఆవిడ కళ్లలోకి చూస్తూ

"వాళ్ల బాబాయి కొడుకు పెళ్లి ఈ ఊళ్లోనే ఉందని ఉన్నపళాన లాక్కొచ్చింది సుశీల" అన్నాడు ఉత్సాహంగా.

"మోహన్ నా మేనబావేనండీ" అంది సుశీల గుండెలమీద వేళ్లాడుతున్న మంగళసూత్రాన్ని సవరించుకుంటూ. వాళ్లిద్దరి పెదాల మీద చిరునవ్వు చిందులేస్తుంది.

"మీ వారు బాగున్నారా శైలజా ?" అంటూ సూట్‌కేస్ తెరిచి పెళ్లానికి గుడ్డలందిస్తున్నాడు.

"పెళ్లి వాళ్లింట్లో పుల్లూరు జాతరలాగుందండీ. జానెడింట్లో మూరెడు కట్టిలా ఇల్లు చిన్నది. చుట్టాలెక్కువ. స్నానం చేద్దామంటేనే కుదరలేదసలు. ఈ ఊళ్లో మీరున్నారని మా వారికి గుర్తుకొచ్చి లాక్కొచ్చారు. మీరూ, మావారూ మంచి స్నేహితులట గదా!" అని బాత్రూంలో దూరి పోయింది సుశీల.

శైలజ తెల్లబోయి గంభీరముద్ర దాల్చింది. ఏం మాట్లాడాలో అర్థంగాక గొంతు బరువెక్కింది.

"నీ ఉత్తరాలకు జవాబివ్వలేదని కోపమా శైలజా ?" శైలజనాపాదమస్తకం పరిశీలిస్తున్నాడు మోహన్. "నీగ్గూడా పెళ్లైంది గదా. నీభర్త ఎలాంటివాడో తెలీదాయె. నేను రాసిన ఉత్తరం ఆయన చేతిలో పడితే ఎలాంటి అపార్థాలకు దారిదీస్తుందోనని రాయలేదంతే !"

"నువ్వు చాలా మారిపోయావు మోహన్ !" మనసులోని మాట సెగలు కక్కుతూ వచ్చింది.

"మారాలి గదా ! జీవితాన్ని పంచుకునే జీవి తోడయ్యాక వాళ్ల ఇష్టా ఇష్టాలను గూడా గౌరవించి తీరాలి గదా!"

శైలజ తల స్ప్రింగ్‌లా పైకి లేచింది. తళతళలాడే కళ్లు చెమ్మగిల్లి నిలబడిపోయినై. మోహన్ మొహంలో ఏ భావమూ లేదు.

"నీ తెల్ల డ్రెస్సూ ... !" అంది ఆర్ద్రోక్తిగా.

"అది మా ఆవిడకిష్టం లేదు."

"అంటే నువ్వు నీ పెళ్లాం చేతిలో కీలుబొమ్మ వయావన్నమాట." ఉడుకుమోత్తనం ఉబికొచ్చింది.

"ఆమె నాచేతిలో తోలుబొమ్మ. నేనావిడ చేతిలో కీలుబొమ్మను. భార్యాభర్తల్లో ఒకరు కోరినట్టు ఇంకొకరు నడిచి తీరాలి. అలవాట్లను మార్చుకోవాలి. సుశీల గూడా నా కోరిక మీదనే బాబ్డ్ హెయిర్ స్టైల్ మానేసి జడేసుకుంటుంది. నేను కోరిన చీర కట్టుకుంటూంది. నాకిష్టం లేదని పెదాలకు లిప్‌స్టిక్ రుద్దుకోవడం మానుకుంది.

"ఎందుకు చెయ్యాలట్లా ?" చిరుకోపం.

"అలా చెయ్యకపోతే కాపురం కొల్లేరైపోతుంది. సంసార సాగరం సుడిగుండాల మయమై పోతుంది. మనశ్శాంతి కరువై పండంటి జీవితం ఎండుటాకులాగై పోతుంది."

శైలజ నరాల్లో ఏదో పారినట్టనిపించింది. కోపం మాయమై ఆలోచనకు తావిచ్చింది.

"ఐతే మన మానసికాందోళనకు మనమే కారణమంటావా మోహన్ ?" శరీరమంతా వింత ప్రకంపనాల మయమైంది.

"నూటికి నూరుశాతం. సరే గానీ మీవారెలాంటి వారు ?" అడిగాడు అలవోకగా.

అల్లకల్లోలమైన అంతరంగము కాస్త స్థిరపడింది. సరికొత్త ఆలోచన మొహాన్ని ముద్ద మందారంలా వికసింపజేసింది.

" మా వారికేం మోహన్ ? ఆయన మనసు మల్లెపూవులా స్వచ్ఛమైంది. చాలా గొప్పగుణం. నేనేంచేసినా సహిస్తారు. ఎలా మెదిలినా ఆమోదిస్తారు. నిజంగా ఆయనో దేవుడు." చెప్పుకుపోతుంటే శైలజ హృదయదౌర్బల్యం పూర్తిగా మాయమైంది.

"ఐతే మీ సంసారం మా సంసారం లాగా స్వర్గమేనన్నమాటా !" అంటూ బాత్రూంనుండి బయటికొచ్చిన భార్యవెంట గదిలో కెళ్లాడు.

ఓ గంట తర్వాత సుశీల దంపతులు వెళ్లి పోయారు. కొన్ని క్వింటాళ్ల బరువు గుండెలమీంచి దిగిపోయివట్టని పించింది శైలజకు.

సాయంత్రం ఐదయేసరికల్లా గులాబి రంగు పట్టుచీర కట్టుకుని మనస్ఫూర్తిగా తయారైంది. రవిచంద్ర రాకకోసం గడపలో నుంచుండి ఎదిరి చూస్తూంది.

**(ఆకాశవాణి హైద్రాబాదు ప్రసారం. తేది: 19-11-1997)**

